

భవితకు.. పాలిటెక్నిక్..!

పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఉమ్మడి జిల్లాలోని పది కాలేజీల్లో ప్రవేశాలకు ఈ నెల 30న పరీక్ష జరగనుంది.

- 8లో



పండుటాకులపై ప్రతాపమా?

కోటబొమ్మాళి మండలం కమలనాభపురంలో పింఛన్లు అందక పలువురు వృద్ధులు ఇబ్బందిపడుతున్నారు. రెండు నెలలుగా ఇదే పరిస్థితి నెలకొంది.

- 8లో

8న జెడ్పీ సర్వసభ్య సమావేశం

అరసవల్లి: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం చైర్‌పర్సన్ పిరియా విజయ అధ్యక్షతన ఈ నెల 8న ఉదయం 10.30 గంటల నుంచి నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ శ్రీధర్‌రాజా ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీటీసీలతో పాటు ముఖ్య ప్రజాప్రతినిధులు హాజరవుతారని, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తాజా ప్రగతినివేదికలతో హాజరుకావాలని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

మెకానిక్ కుమారుడికి రెండు ఉద్యోగాలు



నవీన్‌కుమార్

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని మహారాణిపేటకు చెందిన కోసూరు నవీన్‌కుమార్ ఒకేసారి రెండు ఉద్యోగాలు సాధించాడు. కాశీబుగ్గలో బైక్ మెకానిక్‌గా పని చేస్తున్న కోసూరు భాస్కరరావు, నిర్మల దంపతుల కుమారుడైన నవీన్ 2021లో బీఎస్సీ పూర్తి చేసి విశాఖలో కోచింగ్ తీసుకున్నాడు. పలుమార్లు బ్యాంకు ఉద్యోగాలకు సన్నద్ధమై విఫలమైనా వెనకడుగు వేయకుండా పట్టుదలతో సాధన చేశాడు. తాజాగా బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో పీఓగా, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో క్లర్క్‌గా ఎంపికయ్యాడు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే తాను విజయం సాధించానని నవీన్ తెలిపారు.

సైనికుడికి సలాం



సింహాచలంకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

బూర్జ: మండలంలోని అన్నంపేట గ్రామానికి చెందిన మామిడి సింహాచలం 22 ఏళ్ల సైన్యంలో సర్వీసు పూర్తి చేసి ఉద్యోగ విరమణ పొంది గ్రామానికి వచ్చినందుకు బుధవారం స్థానికులు ఘనంగా స్వాగతం పలికారు. దేశానికి అందించిన సేవలను కొనియాడారు. అనంతరం లవ్లీ యూత్ సంఘం ఆధ్వర్యంలో సింహాచలం, సునీత దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు అప్పలనాయుడు, మాణిక్యం, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాడీబిల్డింగ్ పోటీలకు ఎంపిక



ఎంపికైన బాడీబిల్డర్లతో నిర్వాహకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఈ నెల 4న భీమవరంలో జరగనున్న రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలకు సంబంధించి శ్రీకాకుళం కోడిరామ్మూర్తి స్టేడియంలో బుధవారం ఎంపికలు నిర్వహించారు. 55 కేజీల విభాగంలో బి.అభి, వైకుంఠం, 60 కేజీల విభాగంలో విభాగంలో ఎస్.బన్నీ, సుమంత్, 65 కేజీల విభాగంలో ఎం.రాంబాబు ఎంపికయ్యారు. కార్యక్రమంలో సంఘ చీఫ్ ప్యాట్రన్ డాక్టర్ బాడాన దేవభూషణ్, జిల్లా అధ్యక్షుడు తారకేశ్వరరావు, కార్యదర్శి కె.గౌరీ శంకర్, సీనియర్ బాడీ బిల్డర్లు బి.విజయకుమార్ సందీప్, చరణ్ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి మండలం మాసాహెబ్‌పేట పంచాయతీ సింహాద్రిపురంలో జిరాయితీ భూముల్లో దౌర్జన్యంగా వేసిన రోడ్డును చూపుతున్న బాధితులు



దౌర్జన్య కాండ

- మంత్రి అచ్చెన్న ఇలాకాలో కొనసాగుతున్న సామాజిక బహిష్కరణల పర్వం
- సింహాద్రిపురంలో శ్మశానానికి రోడ్డు పేరుతో జిరాయితీ భూముల్లో రహదారి
- అధికార పార్టీ కార్యకర్తల కక్షసాధింపు
- పోలీసులను ఆశ్రయించినా న్యాయం జరగలేదని బాధితుల ఆవేదన



దాడికి యత్నించారు..

మా భూముల్లో మా అనుమతి లేకుండా ఎందుకు రోడ్డు వేస్తున్నారని అడిగినందుకు నాపై దాడి చేయడానికి ప్రయత్నించారు. ఇంతకు మునుపెన్నడూ ఇలా దౌర్జన్యాలు చూడలేదు. అన్యాయంగా ఇటువంటి పనులు చేయడం మంచిది కాదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మాకు న్యాయం జరిగేలా చూడాలి.

– కూన వరహాలు, బాధితురాలు, సింహాద్రిపురం, కోటబొమ్మాళి మండలం

టెక్కలి:

మంత్రి అచ్చెన్నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న టెక్కలి నియోజకవర్గంలో దౌర్జన్యకాండ కొనసాగుతోంది. మేం అధికారంలో ఉన్నాం.. ఏం చేసినా అడ్డు చెప్పేవారు లేరంటూ కొన్ని గ్రామాల్లో అధికార పార్టీ కార్యకర్తలు విర్రవీగుతున్నారు. రాజకీయ వేధింపులు, కక్ష సాధింపులకు పాల్పడుతూ సామాన్యులపై ప్రతాపం చూపుతున్నారు. అమాయకుల భూములపై దౌర్జన్యకాండకు దిగుతున్నారు. తాజాగా కోటబొమ్మాళి మండలం మాసాహెబ్‌పేట పంచాయతీ సింహాద్రిపురం గ్రామంలో ఇటువంటి ఘటన వెలుగుచూసింది. గ్రామానికి చెందిన సుమారు 11 మంది రైతులకు చెందిన జిరాయితీ భూముల్లో అధికార పార్టీ కార్యకర్తలు దౌర్జన్యంగా రోడ్డు వేయడం.. ఎవరైనా అడ్డు తగిలితే అంతు చూస్తామని బెదిరించడం వివాదాస్పదంగా మారింది. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినా కనీసం న్యాయం చేయడం లేదంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు తమతో గ్రామంలో ఎవరూ మాట్లాడకుండా.. సాయం చేయకుండా సామాజిక బహిష్కరణకు హుకుం జారీ చేశారంటూ వాపోతున్నారు.

మూకుమ్మడిగా దాడి..

సింహాద్రిపురంలో కూన ఇసుములు, కూన రాజశేఖర్, కూన నారాయణరావు, కూన రవి, కూన రామ్మూర్తి, కూన కృష్ణారావు, కూన విజయలక్ష్మి, కూన వానయ్య, కూన పరమేశ్వరరావు, కూన మోహన్‌రావుతో పాటు అదే ప్రాంతంలో ఇటీవల భూమిని కొనుగోలు చేసిన చింతాడ మహేష్‌లకు చెందిన సుమారు 3 ఎకరాల జిరాయితీ భూమిలో అధికార పార్టీ కార్యకర్తలు దౌర్జన్యంగా రోడ్డు నిర్మాణానికి పూనుకున్నారు. బాధిత రైతుల్లో అధికశాతం స్థానికంగా లేకపోవడంతో గ్రామంలో ఉన్న కొంత మంది రైతులు ప్రశ్నించారు. శ్మశానానికి రోడ్డు వేస్తున్నామని.. అడ్డు చెబితే ఊరుకునేది లేదంటూ హెచ్చరిస్తూ ముద్ద ఢిల్లేశ్వరరావు, బర్ల రవి, బర్ల సుందర్‌రావు, బర్ల రామన్న, బర్ల గోపి, రాజాపు యర్రన్న, అంబటి మోహన్, అంబటి ఆనంద్, అంబటి చిన్నమ్మడు, రాజాపు నారాయణమ్మ, ముద్ద శారద, మంత్రి చిన్నప్పన్న తదితరులు తన భర్త చింతాడ మహేష్‌పై దాడి చేసినట్లు భార్య దమయంతి బోరున విలపించారు. మూకుమ్మడిగా దాడి చేయడంతో ప్రాణాలను కాపాడుకోవడానికి భయాందోళనతో తన భర్త గ్రామాన్ని విడిచి ఎక్కడికి వెళ్లిపోయారో తెలియదంటూ కన్నీటి పర్యంతమయ్యారు. గ్రామానికి సమీపంలోనే శ్మశానం ఉన్నప్పటికీ, ప్రస్తుతం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్‌కు అనుకూలంగా ఉన్నామనే కక్షతో తమ భూములపై దౌర్జన్యంగా రోడ్డు వేస్తున్నారని ఆమె వాపోయారు. ప్రస్తుతం ఉన్న శ్మశానం అభివృద్ధికి ఆర్థికంగా సాయం చేస్తామని చెప్పినా తమ పంట పొలాల్లో ఉన్న మట్టిని జేసీబీలతో తవ్వేసి మరీ రోడ్డు వేశారని రోదించారు. రోడ్డు వేస్తున్న వారి కాళ్లావేళ్లా పడినా కనికరించలేదని, మా పంట పొలాలను ఇష్టారాజ్యంగా తవ్వేసి ఆ మట్టితో రోడ్డును వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో మాకు ఎవరూ సాయం చేయకుండా బహిష్కరణ చేశారని వాపోయారు. ఈ ఘటనపై కోటబొమ్మాళి పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు.



తిరుగుబాటు తప్పదు...



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కక్ష సాధింపు చర్యలు, దాడులు దౌర్జన్యకాండ చేస్తున్నారు. ముఖ్యంగా టెక్కలి నియోజకవర్గంలో కోటబొమ్మాళి మండలంలో మారుమూల గ్రామాల్లో బయట సమాజానికి తెలియని ఇటువంటి దౌర్జన్యాలు ఎన్నో జరుగుతున్నాయి. పింఛన్లు ఆపివేయడం.. రేషన్ బియ్యం ఆపివేయడం చేస్తున్నారు. ఇప్పుడు సింహాద్రిపురం గ్రామంలో రైతుల అనుమతి లేకుండా వారి పొలాల్లోని మట్టితోనే దౌర్జన్యంగా రోడ్డు వేస్తున్నారు. అధికారం వస్తే మంచి చేయాలి తప్పా ఇలా కక్ష సాధింపు చర్యలు, దౌర్జన్యాలు చేస్తే ప్రజల నుంచి తిరుగుబాటు తప్పదు. సింహాద్రిపురం గ్రామంలో జరిగిన సంఘటనపై ఉన్నతాధికారులు స్పందించాలి.

–ఎస్.హేమసుందర్‌రాజు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, కోటబొమ్మాళి.

ఆలోచనలు అదుర్స్



- ముగిసిన ఈఎండీపీ జిల్లా ఎక్స్‌పో
- ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు
- రాష్ట్రస్థాయికి రెండు ప్రాజెక్టుల ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: ఒక ఆలోచన జీవితాన్నే మార్చేస్తుందని, పాఠశాల స్థాయి నుంచే పరిశోధనా దృక్పథాన్ని విద్యార్థులు అలవర్చుకోవాలని పాఠశాల విద్య ఆర్జేడీ బి.విజయభాస్కర్ అన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేదికగా బుధవారం వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమం (ఈఎండీపీ) పేరిట ప్రాజెక్టుల ప్రదర్శన చేపట్టారు. జిల్లా నలుమూలల నుంచి 40 పాఠశాలల విద్యార్థులు ప్రాజెక్ట్‌లను ప్రదర్శించారు. పలాస మండలం బ్రాహ్మణతర్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రూపొందించిన అన్వేషి ప్రాజెక్ట్, కోటబొమ్మాళి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు రూపొందించిన సేఫ్ వీల్స్ ప్రాజెక్ట్‌లు తొలి రెండుస్థానాల్లో నిలిచి రాష్ట్రస్థాయి ప్రదర్శనకు అర్హత సాధించాయి. ప్రాజెక్టుల్లో భాగస్వాములైన విద్యార్థులు, గైడ్ టీచర్లను ఆర్జేడీతోపాటు డీఈఓ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య అభినందించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఉప విద్యాశాఖాధికారి ఆర్.విజయకుమారి, జిల్లా సైన్స్ అధికారి ఎస్.కుమారస్వామి, డీసీఈబీ సెక్రటరీ జి.రాజేంద్రప్రసాద్, ఉద్యం స్టేట్ లీడ్ సుశాంత్, జిల్లా మేనేజర్ ఎ.అనూష, ఉపాధ్యాయులు, సైన్స్ అధికారులు పాల్గొన్నారు.



ప్రాజెక్ట్ అన్వేషి

పాఠశాల: బ్రాహ్మణతర్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పలాస మండలం.

విద్యార్థులు: పి.ప్రణీత్, ఎస్.కార్తీక్, కె.మోక్షజ్ఞ

గైడ్ టీచర్: కొయ్యల శ్రీనివాసరావు

అంశం: చాలా మంది చిన్నారులు, మూగవారు, అల్జీమర్స్ వ్యాధితో బాధపడే వృద్ధులు తప్పిపోయినప్పుడు వారి అడ్రస్, వివరాలు వంటివి చెప్పలేరు. అలాంటి వారికి ఉపయోగపడేలా అన్వేషి ప్రాజెక్ట్ రూపొందించారు. అల్జీమర్స్ సమస్యతో బాధపడేవారు నిత్యం ఉపయోగించే వస్తువులకు క్యూఆర్ కోడ్‌లను అమర్చితే.. తప్పిపోయినప్పుడు ఎవరైనా మొబైల్‌ఫోన్‌తో స్కాన్ చేసి కుటుంబ సభ్యులకు వివరాలు చేరవేయవచ్చు. సర్టిఫికెట్లు, నగలు, పెంపుడు జంతువులు ఇలా విలువైన వస్తువులు పోగొట్టుకున్న వారికి సైతం ఇలాగే అందజేయవచ్చని విద్యార్థులు తెలియజేశారు.



బ్రాహ్మణతర్లా జెడ్పీహెచ్ స్కూల్ విద్యార్థులు, గైడ్ టీచర్‌ను అభినందిస్తున్న ఆర్జేడీ విజయభాస్కర్, డీఈఓ తిరుమల చైతన్య

ప్రాజెక్ట్ సేఫ్ వీల్స్

పాఠశాల: ఎస్‌జీబీ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, కోటబొమ్మాళి

విద్యార్థులు: ఎస్.భావన, ఎ.జాహ్నవి, పి.కీర్తి

గైడ్ టీచర్: సీహెచ్‌వీ రోజామణి

అంశం: మద్యం తాగి వాహనం నడపడటం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. సేఫ్ వీల్స్ వ్యవస్థను వాహనాల్లో అమర్చడం ద్వారా అందులో ఉండే ఆల్కహాల్ సెన్సార్లు.. డ్రైవర్ మత్తును గుర్తించడంతోపాటు మైక్రో కంట్రోలర్ ద్వారా విశ్లేషణ చేసి బజర్ మోగించి వాహనాన్ని నిలుపుదల చేస్తుంది. దీంతో కొంతమేర ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చని విద్యార్థులు తెలియజేశారు.



వృత్తి విద్యా కోర్సుల్లో ఉచిత శిక్షణ

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల కాంప్లెక్స్ ఆవరణలోని యూనియన్ బ్యాంక్ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో 30 రోజుల పాటు టైలరింగ్, కంప్యూటర్ అకౌంటెన్సీలో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ కల్లూరి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాకు చెందిన 19 నుంచి 45 ఏళ్ల మహిళలు అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 11 నుంచి శిక్షణ ప్రారంభమవుతుందని, వివరాలకు 79933 40407, 95534 10809 నంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

నేటి నుంచే స్పాట్



మూల్యాంకనం జరగనున్న శ్రీకాకుళం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల

- జిల్లాలో మొదలుకానున్న టెన్త్ మూల్యాంకన ప్రక్రియ
- శ్రీకాకుళం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో కోడింగ్ ప్రక్రియ
- జిల్లాకు చేరిన 1.81 లక్షల జవాబుపత్రాలు

ఏర్పాట్లు పూర్తిచేశాం..



జిల్లాలో నేటి నుంచి మొదలయ్యే టెన్త్‌క్లాస్ జవాబుపత్రాల మూల్యాంకనానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. విద్యాశాఖ కమిషనర్ ఆదేశాలు, జిల్లా కలెక్టర్, ఆర్జేడీ, డీఈఓ సూచనల మేరకు అధికారు లు, ఎగ్జామినర్లు, సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

– లియాకత్ అలీఖాన్, ఎగ్జామినేషన్స్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీకాకుళం

శ్రీకాకుళం న్యూకాలనీ:

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు–2025 జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియకు సర్వం సిద్ధమైంది. జిల్లాలో గురువారం నుంచి మొదలయ్యే మూల్యాంకనానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. స్పాట్‌లో భాగస్వామ్యమయ్యే ఉపాధ్యాయులు తొలిరోజు బహిష్కరిస్తామని తొలుత చెప్పినా బుధవారం సాయంత్రం కల్లా స్పష్టత రావడంతో యథావిధిగా స్పాట్ ప్రారంభం కానుంది. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలతో పాటు సమీపంలోనే మహాలక్ష్మినగర్ కాలనీలో ఉన్న శ్రీచైతన్య స్కూల్ కేంద్రాలుగా మూల్యాంకనం నిర్వహించనున్నారు. క్యాంప్ ఆఫీసర్‌గా డీఈఓ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య నేతృత్వంలో స్ట్రాంగ్ రూమ్ డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్/ అసిస్టెంట్ కమిషనర్ లియాఖత్ ఆలీఖాన్ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. ఇద్దరు డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్లుగా ఉప విద్యాశాఖాధికారులు ఆర్.విజయకుమారి(శ్రీకాకుళం), పి.విలియమ్స్(టెక్కలి/పలాస) వ్యవహరించనున్నారు. అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్లు(వాల్యుయేషన్)గా మరో ఏడుగురు సీనియర్ హెచ్ఎంలను నియమించారు. జవాబుపత్రాలను దిద్దే అన్ని గదుల్లో సీసీ కెమెరాలను అమర్చారు.

శరవేగంగా కోడింగ్ ప్రక్రియ..

స్పాట్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలపై ఆర్జేడీ, డీఈఓ, ఇతర అధికారులు ఆరా తీశారు. టెన్త్ జవాబుపత్రాలకు సంబంధించి తెలుగు/సంస్కృతం/ఉర్దూ, హిందీ, ఇంగ్లీషు(లాంగ్వేజ్ పేపర్లు), మాథ్స్, ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్, సోషల్‌స్టడీస్ మొత్తం 7 పేపర్లకు సంబంధించి 24 పేజీల బుక్‌లెట్స్‌తో కూడిన 1,81,367 జవాబుపత్రాలు జిల్లాకు చేరుకున్నాయి. కోడింగ్ ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. తెలుగుమీడియం, ఇంగ్లీషు మీడియం, ఒరియా మీడియం జవాబుపత్రాల మూల్యాంకనం జరగనుంది.

1229 మంది సిబ్బంది..

టెన్త్ స్పాట్‌కు1229 మంది టీచర్లు భాగస్వామ్యం అవుతున్నారు. సబ్జెక్టు టీచర్లు పూటకు 20 పేపర్ల చొప్పున రోజుకు 40 పేపర్లను దిద్దనున్నారు. పేపర్‌కు రూ.10 చొప్పున 40 పేపర్లకు రూ.400 కేటాయిస్తారు. డీఏగా సుదూర ప్రాంతాల పాఠశాలల నుంచి హాజరయ్యే ఉపాధ్యాయులకు అవుట్‌స్టేషన్ అలవెన్స్‌గా రూ.400 చెల్లిస్తారు. స్పెషల్ అసిస్టెంట్లకు రోజుకు రూ.300 చొప్పున చెల్లిస్తారు. అరకొరగా ఉండే ఈ మొత్తాలని గత ఏడాదే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెంచిన విషయం తెలిసిందే.

కలెక్టర్‌తో చర్చలు సఫలం



కలెక్టర్‌తో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు

- మరో ముగ్గురు టీచర్లపై సస్పెన్షన్లు ఎత్తివేత
- స్పాట్ కేంద్రాలకు దూరంగా డీఈఓ

శ్రీకాకుళం న్యూకాలనీ/శ్రీకాకుళం పాతబస్టాండ్: కుప్పిలి కాపీయింగ్ ఘటనలో టీచర్ల సస్పెన్షన్ నేపథ్యంలో స్పాట్ బహిష్కరిస్తామంటూ ఉపాధ్యాయ సంఘాల హెచ్చరికల నేపథ్యంలో పాఠశాల విద్య ఆర్జేడీ బి.విజయభాస్కర్ విజ్ఞప్తి మేరకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ రంగంలోకి దిగారు. ద్యోగ సంఘాల జిల్లా జేఏసీ చైర్మన్ హనుమంతు సాయిరాం మధ్యవర్తిత్వం ద్వారా బుధవారం ఉపాధ్యాయ సంఘాల జేఏసీ కన్వీనర్లు చౌదరి రవీంద్ర, తంగి మురళీమోహన్, మజ్జి మదన్‌మోహన్‌లతో కలెక్టర్ తన కార్యాలయంలో చర్చలు జరిపారు. ప్రధాన డిమాండ్లపై సానుకూలంగా స్పందించి తగు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. సస్పెన్షన్‌కు గురైహోల్డ్‌లో ఉన్న నలుగురు ఉపాధ్యాయుల్లో ముగ్గురిపై బుధవారం రాత్రి సస్పెన్షన్ ఎత్తివేశారు. ఉపాధ్యాయులపై ఉన్న క్రిమినల్ కేసులను ఎత్తివేసేందుకు నిర్ణయించారు. స్పాట్ కేంద్రాలకు డీఈఓను దూరంగా ఉంచేందుకు కూడా అంగీకరించారు. విచారణ కమిటీ నివేదిక ప్రకారం డీఈఓపై తగు చర్యలు చేపడతామని చెప్పారు.

శోక సంద్రం



ధనరాజు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

- తీరానికి చేరిన మత్స్యకారుల మృతదేహాలు
- బోరున విలపించిన బాధిత కుటుంబాలు
- మంచినీళ్లపేటలో విషాదఛాయలు

వజ్రపుకొత్తూరు రూరల్/వజ్రపుకొత్తూరు:

తీరం శోకసంద్రమైంది. గల్లంతైన మత్స్యకారుల మృతదేహాలు ఒడ్డుకు చేరడంతో బాధిత కుటుంబాలు కన్నీరుమున్నీరుగా విలపించాయి. వజ్రపుకొత్తూరు మండలం నువ్వలరేవు జెట్టీ సమీపంలో మంగళవారం వేకువజామున ఫైబర్ తెప్ప బోల్తా పడిన సంఘటనలో మంచినీళ్ల పేట గ్రామానికి చెందిన ఇద్దరు మత్స్యకారులు వంక కృష్ణ (44), బుంగ ధనరాజు(45) గల్లంతైన సంగతి తెలిసిందే. వీరి మృతదేహాలు బుధవారం ఉదయం అక్కుపల్లి సముద్ర తీరానికి కొట్టుకొచ్చాయి. విషయం తెలుసుకున్న మంచినీళ్లపేట గ్రామ మత్స్యకారులు, మృతుల కుటుంబ సభ్యులు, పోలీసులు ఘటనా స్థలాలకు చేరుకున్నారు. మృతదేహాలను తెప్పపైనే ఎక్కించి గ్రామానికి తీసుకొచ్చి కుటుంబ సభ్యుల సమక్షంలో ఎస్ఐ బి.నీహార్ శవ పంచనామా చేశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బతుకు తెరువుకు వెళ్లి..


ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు మత్స్యకారులు ఒకేసారి మృతిచెందడంతో మంచినీళ్లపేటలో విషాదఛాయలు అలముకున్నాయి. బతుకు తెరువు కోసం చేపల వేటకు వెళ్లిన ఇంటి పెద్దలు మత్స్యసంపదతో ఇంటికి చేరుతారని ఎన్నో ఆశలతో ఎదురు చూస్తున్న కుటుంబ సభ్యులు.. తీరానికి చేరిన మృతదేహాలు చూసి రోదించడం అక్కడి వారిని కంటతడి పెట్టించింది. బాధిత కుటుంబాలను ఆదుకోవాలని బంధువులు, స్థానికులు కోరుతున్నారు.

మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా

సముద్రంలో వేటకు వెళ్లి మృతి చెందిన మంచినీళ్లపేటకు చెందిన మత్స్యకారులు వంక క్రిష్ణ, బుంగ ధనరాజు కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేయనున్నట్లు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రకటించారు. బుధవారం బాధిత కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. ప్రభుత్వం నుంచి రూ.5 లక్షలు, సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా త్వరలోనే అందిస్తామన్నారు. అనంతరం పాడైన బోటుకు రూ.50 వేలు చెక్కు, వలలు, ఇంజిన్లను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు గుల్ల చిన్నారా వు, జి.శంభూరావు, వంక రాజు, సొసైటీ అధ్యక్షుడు బుంగ కోటేశ్వరరావు, ఎఫ్‌డీఓ ధర్మరాజు పాత్రో, పీరుకట్ల విఠల్, గోవింద పాపా రావు, సూరాడ మోహనరావు పాల్గొన్నారు.



వంక కృష్ణ మృతదేహం



వెల్లువెత్తిన నిరసనలు

వివిధ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లాలో బుధవారం నిరసనలు వెల్లువెత్తాయి. ఉపాధ్యాయులు, రెల్లి కుల సంఘ నాయకులు, గిరిజనులు.. ఇలా పలు వర్గాల వారు ర్యాలీలు చేపట్టి అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

8లో

బబుల్ గమ్‌తో హుండీ చోరీ



మండలంలోని నౌపడ గ్రామంలో ఇటీవల పునర్నిర్మాణం జరుపుకొన్న భూలోకమ్మ తల్లి ఆలయంలో బుధవారం హుండీ చోరీ జరిగింది. చిన్నపాటి కర్రపుల్లకు బబుల్ గమ్ అంటించి హుండీ రంధ్రంలో పెట్టి రూ.500, రూ.200, రూ.100, రూ.50 నోట్లు తీసివేసి మిగిలిన చిల్లర రూ.180 అలాగే వదిలేశారు. సుమారు రూ.20 వేలు వరకు చోరీకి గురైందని స్థానికులు చెబుతున్నారు. దీనిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

– సంతబొమ్మాళి

క్లుప్తంగా

అవగాహన సదస్సు రేపు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఐదో తరగతి నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఐఐటీ, మెడికల్ ఫౌండేషన్‌పై అవగాహన సదస్సు ఈనెల 4వ తేదీన నిర్వహించనున్నట్లు తిరుమల విద్యాసంస్థల అధినేత ఎస్.తిరుమలరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నంలోని రాజులతాళ్లవలస తిరుమల క్యాంపస్‌లో ఉదయం 10 గంటల నుంచి సదస్సు జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 98489 86450, 98489 86451 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పచ్చ నేతల హల్‌చల్


బ్యాంకు అధికారుల పక్కన కూర్చున్న టీడీపీ నాయకుడు పెద్దిన బాబ్జీ

ఇచ్ఛాపురం రూరల్: బీసీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి లబ్ధిదారుల ఎంపికలో కూటమి నాయకులు హల్‌చల్ చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో కె.రామారావు ఆధ్వర్యంలో బుధవారం జరిగిన ఇంటర్వ్యూలకు 402 మంది దరఖాస్తుదారులు హాజరయ్యారు. అయితే ఈ సమయంలో కూటమి నాయకులు బ్యాంకు అధికారుల పక్కనే కూర్చొని తమ అనుచరులకు ప్రాధాన్యతనివ్వాలని కోరారు. దీంతో సబ్సిడీ రుణాల మంజూరుపై బ్యాంకు అధికారులను సైతం కూటమి నాయకులు ప్రసన్నం చేసుకోవడానికి ప్రయత్నించడం సరికాదని పలువురు బహిరంగంగా విమర్శించారు.

రైలుకింద పడి మహిళ మృతి


మృతదేహం పరిశీలిస్తున్న జీఆర్పీ పోలీసులు

కాశీబుగ్గ: పలాస జీఆర్పీ పోలీసుస్టేషన్ పరిధిలో ఉన్నటువంటి సోంపేట రైల్వేస్టేషన్ యార్డ్ నందు గుర్తు తెలియని మహిళ రైలు కిందపడి బుధవారం మృతి చెందింది. పలాస జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సుమారు 40 నుంచి 45 ఏళ్ల వయస్సు ఉన్న మహిళ మృతదేహం గుర్తుపట్టలేని స్థితిలో లభించిందని తెలిపారు. మృతురాలు గులాబీ, పసుపు రంగు కలిగిన పంజాబీ డ్రెస్ ధరించి ఉందన్నారు. చామన చాయ రంగు కలిగి ఉండి, శరీరం రెండుగా విడిపోయి ఉందని కానిస్టేబుల్ డి.హరినాథ్ వివరించారు. వివరాలు తెలిసినవారు 99891 36143 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

8 మంది పేకాటరాయుళ్లు అరెస్టు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 8వ వార్డు పరిధిలో ఉన్నటువంటి నర్సిపురం కాలనీలో పేకాట ఆడుతున్న 8 మంది వ్యక్తులు కాశీబుగ్గ పోలీసులకు బుధవారం పట్టుబడ్డారు. నర్సిపురం కాలనీ లే అవుట్‌లో పేకాట శిబిరాన్ని ఏర్పాటు చేసుకుని ప్రతిరోజూ ఆడుతున్నారు. విషయం తెలుసుకున్న కాశీబుగ్గ పోలీసులు పక్కా ప్లాన్‌తో ఆడుతున్న స్థలానికి వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. పేకాటరాయుళ్లు నుంచి రూ.60,400ల నగదు, పేక ముక్కలు, మూడు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో స్వాధీనం చేసుకున్నారు. కాశీబుగ్గ ఎస్ఐ ఆర్.నరసింహమూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొత్త పాసులు ఇవ్వకపోవడం సరికాదు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం నగరంలోని కాంప్లెక్స్ వద్ద కొత్తగా అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు కొత్తపాసులు ఇవ్వకపోవడం సరికాదని ఆంధ్రప్రదేశ్ స్కూల్స్ అండ్ కాలేజీస్ పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గంగు మన్మథరావు, ఏబీవీపీ జిల్లా అధ్యక్షుడు మాధవ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చందు, హరీష్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మార్చి చివరిలో జరిగిన ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ బీఎస్సీ, పారామెడికల్ కౌన్సిలింగ్‌లో విద్యార్థులు పలు కళాశాలల్లో నూతనంగా అడ్మిషన్లు పొందారన్నారు. వీరు తమ కళాశాలల ప్రిన్సిపాల్స్ నుంచి బోనఫైడ్ సర్టిఫికెట్‌తో ఆర్టీసీ కాంప్లెక్స్‌కి వెళ్తే కొత్తపాసులు మంజూరు చేసేందుకు నిరాకరించడం దారుణమన్నారు. పేద విద్యార్థులు కావడంతో పాసులు మంజూరు చేయకపోతే రాకపోకలకు అప్పులు చేయాల్సిన పరిస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అందువలన అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. లేకుంటే ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు.

భవితకు.. పాలిటెక్నిక్..!

- ఉమ్మడి జిల్లాలో 10 కళాశాలలు
- ఐదు ప్రభుత్వ కళాశాలల్లో 780 సీట్లు
- ఐదు ప్రైవేట్ కళాశాలల్లో 1,801 సీట్లు
- ఈనెల 30న పాలీసెట్ పరీక్ష


శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల


ప్రాజెక్టులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు(ఫైల్)

ఎచ్చెర్ల క్యాంపస్: పేద, మధ్య తరగతి విద్యార్థులు 10వ తరగతి ఉత్తీర్ణత తర్వాత ప్రాధాన్యతనిచ్చే కోర్సుల్లో పాలిటెక్నిక్ కోర్సు ఒకటి. ఈ కోర్సులో చేరడం వలన తక్కువ వయస్సులో ఉద్యోగం, ఆసక్తి ఉంటే ఇంజినీరింగ్ చదివేందుకు అవకాశం ఉంటుంది. సాంకేతిక విద్యాశాఖ సైతం పారిశ్రామిక రంగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు అనుగుణంగా కరిక్యులమ్ తీర్చిదిద్దుతోంది. మిగతా కోర్సులతో పోల్చిచూస్తే పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్లేస్‌మెంట్లు ఎక్కువ. రైల్వే, డిఫెన్స్, ఇతర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయి.

ఉచిత శిక్షణ

ప్రభుత్వ కళాశాలల్లో పాలీసెట్ – 2025కు సాంకేతిక విద్యాశాఖ ఉచిత శిక్షణ ఇస్తోంది. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పురుషులకు, శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా కళాశాలలో బాలికలకు, ఆమదాలవలస, టెక్కలి, సీతంపేట పాలిటెక్నిక్ కళాశాలల్లో బాలురు, బాలికలకు గురువారం నుంచి శిక్షణ ఇస్తారు. ఈ శిక్షణ ఈనెల 28వ తేదీ వరకు ఉంటుంది. నమూనా పరీక్ష సైతం శిక్షణ ముగింపు చివరిలో నిర్వహిస్తారు. ప్రారంభంలో స్టడీ మెటీరియల్ సైతం అందజేస్తారు.

దరఖాస్తుల స్వీకరణ

ప్రస్తుతం పాలీసెట్ – 2025 దరఖాస్తుల స్వీకరణ ఆన్‌లైన్‌లో కొనసాగుతోంది. మార్చి 12వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. ఈనెల 15వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థుల సౌలభ్యం కోసం సహాయ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పూర్తి వివరాలకు విద్యార్థులు http://apsbtet.ap.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాల్సి ఉంటుంది. పరీక్షను ఈనెల 30వ తేదీన నిర్వహిస్తారు. దరఖాస్తు రుసుము బీసీ, ఓసీ విద్యార్థులకు రూ.400 లు, ఎస్సీ, ఎస్టీలకు రూ.100లుగా నిర్ణయించారు. 120 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. గణితం నుంచి 50 మార్కులు, ఫిజిక్స్ నుంచి 40 మార్కులు, కెమిస్ట్రీ నుంచి 30 మార్కులకు ప్రశ్నలు వస్తాయి. రెండు గంటల్లో పరీక్ష రాయాల్సి ఉంటుంది. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష నిర్వహిస్తారు.

కళాశాలల్లో సీట్లు

కళాశాల	సీట్లు
ప్రభుత్వ కళాశాలలు	
శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్	300
శ్రీకాకుళం మహిళా పాలిటెక్నిక్	120
టెక్కలి ప్రభుత్వ పాలిటెక్నిక్	120
ఆమదాలవలస ప్రభుత్వ పాలిటెక్నిక్	120
సీతంపేట ప్రభుత్వ పాలిటెక్నిక్	120
ప్రైవేట్ కళాశాలలు	
శ్రీ వేంకటేశ్వర(ఎచ్చెర్ల)	462
ఐతం(టెక్కలి)	396
నారాయణ(గూడెం)	383
టీవీఆర్(మందస)	297
శ్రీశివానీ(చిలకపాలెం)	263

జిల్లాలో ఐదు ప్రభుత్వ కళాశాలల్లో 780, ఐదు ప్రైవేట్ కళాశాలల్లో 1,801 సీట్లు ఉన్నాయి. మొత్తం 2,581 సీట్లు ఉన్నాయి. సీసీపీ, సివిల్, మెకానికల్, ఈఈఈ, ఎంఈసీ బ్రాంచ్‌లు ప్రధానంగా ఉన్నాయి.

సద్వినియోగం చేసుకోవాలి



పదో తరగతి పరీక్షలు పూర్తవ్వడంతో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో పాలీసెట్ –2025 శిక్షణ 3వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నాం. ఈ శిక్షణ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. నిపుణులతో శిక్షణ ఇవ్వడం, నమూనా పరీక్ష నిర్వహించడం, స్టడీ మెటీరియల్ అందజేయడం జరుగుతుంది. సాంకేతిక విద్యాశాఖ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దృష్టిలో పెట్టుకొని సిలబస్‌ను సైతం తీర్చిదిద్దింది.

– బి.జానకి రామయ్య,
శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా ప్రవేశాల ఇన్‌చార్జి

బాలికలకు ప్రత్యేక శిక్షణ



మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో బాలికలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. ఈ అవకాశాన్ని బాలికలు సద్వినియోగం చేసుకోవాలి. పాలిటెక్నిక్ విద్య తర్వాత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉంటాయి. ఆసక్తి మేరకు ఉన్నత విద్య సైతం చదవవచ్చు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలి.

– టి.విక్టర్ పాల్,
శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్, ప్రిన్సిపాల్

మెరుగైన ప్లేస్‌మెంట్స్



మిగతా కోర్సులతో పోల్చితే పాలిటెక్నిక్ విద్యలో ప్లేస్‌మెంట్స్ ఎక్కువగా ఉంటాయి. ప్రారంభం నుంచి మూడేళ్ల పాటు పారిశ్రామిక అవసరాలపై శిక్షణ ఉంటుంది. ప్రయోగ విద్యకు ప్రాధాన్యత ఉంటుంది. కాలానుగుణంగా సిలబస్‌లో సైతం సాంకేతిక విద్యాశాఖ మార్పులు చేస్తోంది.

– మురళీకృష్ణ,
సీనియర్ అధ్యాపకులు

హేతుబద్ధత లేని వర్గీకరణ ఆపాలి


ర్యాలీ నిర్వహిస్తున్న రెల్లి కులస్తులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: హేతుబద్ధత లేని వర్గీకరణను తక్షణమే నిలుపుదల చేయాలని జాతీయ రెల్లి ఎస్సీ గ్రూపు కులాల సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పి.సుధాకర్ డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణలో భాగంగా రెల్లి గ్రూపు కులాలకు జరగనున్న అన్యాయాన్ని నిరసిస్తూ నగరంలోని పెద్దరెల్లివీధి నుంచి ఏడురోడ్ల జంక్షన్ మీదుగా కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ బుధవారం నిర్వహించారు. కలెక్టరేట్ చేరుకొని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం జాతీయ ప్రధాన కార్యదర్శి పి.సుధాకర్ మాట్లాడుతూ.. రాజకీయ ప్రాతినిధ్యం లేని కులాలకు ప్రభుత్వమే బాధ్యత తీసుకొని రాజ్యాంగ ఫలాలను అందజేయాలని కోరారు. రాష్ట్రంలో విద్యా, ఉద్యోగ నియామకాల్లో ఆర్టికల్ 371 (డి) అనుసరించి జిల్లా, జోన్, రాష్ట్రంలో అవకాశాలు కల్పించాలని కోరారు. అలా కాని పక్షంలో రెల్లి గ్రూపు కులాల అభ్యర్థులకు నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తాము వర్గీకరణను వ్యతిరేకించడం లేదని, హేతుబద్ధత లేని వర్గీకరణను తక్షణమే నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన సూచనలు, సలహాల మేరకు వర్గీకరణ చేయాలని కోరుతున్నామన్నారు. దీనిలో భాగంగా రెల్లి గ్రూపు కులాల విద్యా, ఉద్యోగ, సామాజిక, ఆర్థిక అభివృద్ధి కోసం ప్రత్యేకమైన నిధులు కేటాయించి, వారి జీవన ప్రమాణాల మెరుగుదలకు ప్రభుత్వం పెద్ద మనసుతో సహకరించాలని విన్నవించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అర్జి కోటి, నగర అధ్యక్షుడు ఎ.ఈశ్వరరావు, రెల్లి ఉప కులాల నాయకులు కాశీ రథో, గోడలి మిన్ను, దండాసి దుర్యోధన, బైరి శివప్రసాద్, దేవర రాము, లోకొండ లక్ష్మణరావు, మజ్జి బాబ్జి, విశాఖపట్నం రవి, వీరగొట్టం ఆనంద్, రణస్థలం ఫణి కుమార్, జలగడుగుల శ్రీరామ, కె వెంకటరావు, జె గోవిందరావు, ఎ.గోవిందరావు, విజయ్, ఎం.రామారావు, జె.శ్రీను, ఇంటి రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ కార్యాలయం ఏర్పాటు చేయాలి


నిరసన తెలుపుతున్న గిరిజనులు

మందస/కాశీబుగ్గ: పలాస నియోజకవర్గంలోని మందస కేంద్రంగా గిరిజన అభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) ప్రధాన కార్యాలయం ఏర్పాటు చేయాలని గిరిజనులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మందసలో శ్రీకాకుళం జిల్లా గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించి, తహసీల్దార్ ఎస్.హైమావతికి వినతిపత్రం అందజేశారు. పలాస నియోజకవర్గంలో గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. గిరిజన ప్రాంతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు భూకబ్జాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనులు దశాబ్దాలుగా సాగు చేస్తున్న భూములకు హక్కులు కల్పించి పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని విన్నవించారు. అలాగే ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. గిరిజనులు పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, 1/70 చట్టాన్ని అమలు చేయాలని, గిరిజన గ్రామాల్లో సాగునీటి వసతులు కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు చాపర సుందర్‌లాల్, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి సవర హరికృష్ణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ రవి, గిరిజన సంఘం నాయకులు సవర ఎంగిలాకు, సవర సోంబారమ్మ, సవర నీలకంఠం, సవర కిరణ్‌కుమార్, దండాసి రవి, సవర రమేష్, సవర జునాస్, సవర కురామణి, సవర భువనేశ్వర్ దులాయ్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డు ఏర్పాటు


అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

సాక్షి ఎఫెక్ట్...

ఇచ్ఛాపురం రూరల్: తమ స్థలానికి ఎదురుగా ఉన్న రచ్చబండను తొలగించి, ఆ స్థలాన్ని సొంతం చేసుకునేందుకు కె.శాసనాం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ఇసురు ఫకీరు ఇటీవల తన అనుచరులతో కలిసి రచ్చబండను తొలగించారు. దీనిపై సాక్షి దినపత్రికలో 'పచ్చ తమ్ముడి బరితెగింపు' శీర్షికతో సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు బుధవారం స్పందించారు. 'ఇది ప్రభుత్వ భూమి.. ఆక్రమణదారులు శిక్షార్హులు' అని పేర్కొంటూ హెచ్చరిక బోర్డు తహసీల్దార్ కె.వెంకటరావు ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది ఏర్పాటు చేశారు.

16 గొర్రె పిల్లల సజీవదహనం

మెళియాపుట్టి: మండలంలోని కరజాడ గ్రామానికి చెందిన దాసరి శ్రీనివాసరావు, దాసరి ఢిల్లేశ్వరరావు, సార రామయ్యలకు చెందిన 16 గొర్రె పిల్లలు సజీవ దహనమయ్యాయి. మార్చి 30వ తేదీ రాత్రి ఈ ఘటన జరిగినట్లు పెంపకందారులు చెబుతున్నారు. బుధవారం పలువురు పెంపకందారులతో మాట్లాడగా గిట్టని వాళ్లెవరో ఇటువంటి దుశ్చర్యకు పాల్పడి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. దీంతో సుమారు రూ.50 వేల వరకు నష్టం జరిగిందని, అధికారులు పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

మత విద్వేషాలు రెచ్చగొడితే కఠిన చర్యలు


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ :

మత విద్వేషాలు రెచ్చగొడితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి హెచ్చరించారు. జిల్లాకేంద్రంలోని టౌన్ హాల్ రోడ్డులోని ఆర్‌సీఎం సెయింట్ థామస్, చినబజారు రోడ్డులో ఉన్న చర్చి రక్షణ గోడలపై అన్యమత రాతలు రాసిన ఇద్దరు యువకులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించి బుధవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. జిల్లాకేంద్రంలోని గూనపాలెం మేదరవీధికి చెందిన నర్రు దుర్గాప్రసాద్ (25) అలియాస్ ప్రసాద్ ఓ ఫుడ్ డెలివరీ సంస్థలో బాయ్‌గా, అదే వీధికి చెందిన గ్రంధి సోమశేఖర్ (23) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నారు. మంగళవారం రాత్రి 9:30 ప్రాంతంలో ఇద్దరూ స్కూటీపై వచ్చి సెయింట్ థామస్ చర్చి రక్షణ గోడపై అన్యమత రాతలు రాశారు. అనంతరం తెలుగు బాప్టిస్ట్ చర్చి వద్దకు చేరుకున్నారు. సోమశేఖర్ ఎలక్ట్రీషియన్ కావడంతో అక్కడ విద్యుత్‌ను నిలుపుదల చేసి ఇద్దరూ రక్షణ గోడ, లోపల అన్యమత రాతలు రాసి పరారయ్యారు. విషయం తెలుసుకున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి డీఎస్పీ వివేకానందకు ఆదేశాలు జారీ చేయడంతో ఒకటి, రెండో పట్టణ సీఐలను ఘటనాస్థలికి పంపించారు. అక్కడి స్థానికులను విచారించి సీసీ ఫుటేజీలను పరిశీలించిన అనంతరం నిందితులిద్దరినీ గుర్తించారు. బుధవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో అరసవల్లి మామిడి తోట వద్ద సీఐ పైడపునాయుడు బృందం నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

ఫేమస్ అవుదామనే..

జిల్లాలో ఇటీవల జలుమూరులో జరిగిన అన్యమత రాతల ఉదంతాన్ని దృష్టిలో పెట్టుకుని ఒక్కసారిగా ఫేమస్ అవుదామనే ఇద్దరు యువకులు ఇలా రాతలకు పాల్పడ్డారని పోలీసుల విచారణలో తేలిందన్నారు. కేసును డీఎస్పీ వివేకానంద ఆధ్వర్యంలో చాకచక్యంగా ఛేదించిన సీఐ పైడపునాయుడు, ఎస్ఐలు హరికృష్ణ, జనార్ధన, ఇతర సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించవద్దు

ఆలయాలు, చర్చిలు, మసీదులు వంటి ప్రార్థనా మందిరాల వద్ద తీసుకోవాల్సిన భద్రతా చర్యలు, పాటించాల్సిన జాగ్రత్తలను ఎస్పీ వివరించారు. కుల, మత, రాజకీయ వర్గాల మధ్య మతపరమైన అవాస్తవాలు ప్రచారం చేస్తూ జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా.. సోషల్ మీడియాలో పోస్టులను పెట్టినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మందిరాల నలువైపులా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, స్థానికులతో యూత్ కమిటీ, శాంతి కమిటీలను ఏర్పాటుచేయాలని సూచించారు. రాత్రి పూట ఇద్దరేసి కమిటీ సభ్యులు ఉండాలన్నారు. హుండీలకు భద్రతా వలయాన్ని ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు.

పండుటాకులపై ప్రతాపమా..?

- రెండు నెలలుగా 8 మంది వృద్ధులకు అందని పింఛన్లు
- ఇన్‌చార్జి ఎంపీడీవోను నిలదీసిన వైఎస్సార్‌సీపీ నేతలు


ఇన్‌చార్జి ఎంపీడీవో జయంత్‌ప్రసాద్‌ను నిలదీస్తున్న నాయకులు

టెక్కలి: కోటబొమ్మాళి మండలం కమలనాభపురం గ్రామంలో దువ్వారపు అప్పన్న, కర్రి లక్ష్మణ, రోణంకి సింహాచలం, గురువెల్లి గోపాలరావు, కూన సుగ్రీవులు, మొజ్జాడ సూర్యనారాయణ, బొడ్డేపల్లి ధర్మారావు, నెయ్యిల లక్ష్మీనారాయణలకు వృద్ధాప్య పింఛన్లు రెండు నెలలుగా అధికారులు అందజేయడం లేదు. దీంతో గ్రామ సర్పంచ్ సంపతిరావు ధనలక్ష్మి, నాయకులు అన్నెపు రామారావు, ఎస్.హేమసుందర్‌రాజు, కె.సంజీవరావు, దుక్క రామకృష్ణారెడ్డి, ఎస్.జనార్ధన్‌రెడ్డి, బి.వెంకటరమణ, జి.సోమేష్, శివారెడ్డి, ఎస్.నారాయణరాజు తదితరులు బాధిత పింఛనుదారులతో కలిసి బుధవారం కోటబొమ్మాళి ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లారు. అక్కడ ఇన్‌చార్జి ఎంపీడీవో జయంత్‌ప్రసాద్‌ను నిలదీశారు. నిన్నటివరకు విధుల్లో ఉన్న ఎంపీడీవో ఫణీంద్రకుమార్ ఆదేశాలతో పంచాయతీ కార్యదర్శి రమేష్ గత నెలలో పింఛన్లు ఆపివేశారని తెలిపారు. దీనిపై అప్పుడు అడిగితే ఏప్రిల్ నెలలో పింఛన్లు ఇస్తామని చెప్పారని గ్రామ సర్పంచ్ ధనలక్ష్మి గుర్తు చేశారు. అయితే ఈనెల 1వ తేదీన గ్రామంలో చేపట్టిన పింఛన్ల పంపిణీలో మరలా 8 మంది వృద్ధులకు పింఛన్లు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిన్నటివరకు విధుల్లో ఉన్న ఎంపీడీవో ఫణీంద్రకుమార్‌ను ఈ విషయంపై సంప్రదిస్తే 2వ తేదీన పింఛన్లు ఇచ్చేస్తామని చెప్పారన్నారు. కానీ ఇప్పుడు ఆయన సెలవు పెట్టి వెళ్లిపోయారని అదే గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు హేమసుందర్‌రాజు మండిపడ్డారు.

ఏమని దర్యాప్తు చేస్తారు..?

అయితే నిలిపివేసిన పింఛన్లపై దర్యాప్తు చేస్తామని ఇన్‌చార్జి ఎంపీడీవో జయంత్‌ప్రసాద్ చెప్పగా, డీఆర్‌డీఏ నుంచి కాకుండా స్థానికంగా కక్ష సాధింపులో భాగంగా పింఛన్లు ఆపేస్తే ఏమని దర్యాప్తు చేస్తారని వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు. నిరుపేద వర్గాలకు చెందిన వృద్ధుల పింఛన్లను రెండు నెలలుగా ఆపివేసి ఇప్పుడు కథలు చెబుతున్నారని ధ్వజమెత్తారు. టీడీపీ కార్యకర్తలు చెబితేనే పింఛన్లు ఆపివేశామని కాగితంపై రాసిచ్చేయండి అంటూ వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు అన్నెపు రామారావు దుయ్యబట్టారు. అయితే సాయంత్రంలోగా పింఛన్లు ఇచ్చేస్తామంటూ సెలవుపై వెళ్లిన ఎంపీడీవో ఫణీంద్రకుమార్ ఫోన్‌లో సమాధానం చెప్పాడు. తీరా సాయంత్రానికి అతను ఫోన్ లిఫ్ట్ చేయకపోవడమే కాకుండా, పంచాయతీ కార్యదర్శి రమేష్ సైతం ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడని నాయకులు వెల్లడించారు. బాధిత పింఛన్‌దారులకు పింఛన్ డబ్బులు ఇచ్చేవరకు న్యాయ పోరాటం చేస్తామని పేర్కొన్నారు.

30 శాతం ఐఆర్ ప్రకటించాలి


నిరసన తెలుపుతున్న ఫ్యాప్టో నాయకులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉపాధ్యాయులకు తక్షణమే 30 శాతం ఐఆర్ ప్రకటించాలని, 12వ పీఆర్సీ కమిషన్ నియమించాలని ఫ్యాప్టో జిల్లా చైర్మన్ బమ్మిడి శ్రీరామ్మూర్తి, సెక్రటరీ జనరల్ పడాల ప్రతాప్ కుమార్‌లు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, ఉమ్మడి సర్వీసు రూల్స్ సమస్య పరిష్కరించి ప్రమోషన్లు కల్పించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఫ్యాప్టో సభ్య సంఘాల నాయకులు మజ్జి మదన్మోహన్, ఎస్.కిషోర్ కుమార్, చౌదరి రవీంద్ర, లండ బాబురావు, టెంక చలపతిరావు, బి.రవి కుమార్, ఎస్వీ రమణమూర్తి, పూజారి హరి ప్రసన్న, కొమ్ము అప్పలరాజు, వాల్తేటి సత్యనారాయణ, జి.రమణ, సీర రమేష్ బాబు, జగన్మోహన్ ఆప్తా, బలివాడ ధనుంజయరావు, కొత్తకోట శ్రీహరి, గొంటి గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

- ఆర్టీసీ ఈయూ జోనల్ కార్యదర్శి మూర్తి


మాట్లాడుతున్న బీకే మూర్తి

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలో ఆర్టీసీ పరిధిలోని శ్రీకాకుళం-1, 2 డిపోలు, టెక్కలి, పలాస తదితర నాలుగు డిపోల్లో పేరుకుపోయిన ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ జోనల్ కార్యదర్శి బి.కె.మూర్తి డిమాండ్ చేశారు. శ్రీకాకుళం కాంప్లెక్స్ ఆవరణలోని ఈయూ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్రమ సస్పెన్షన్లు, అక్రమ బదిలీలు రద్దు చేసి 1/2019 సర్క్యులర్ అమలు చేయాలని కోరారు. ఆర్టీసీలో కొంతమంది ఉద్యోగులు అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ ఉద్యోగులను ఉద్యమాల వైపు నెడుతున్నారన్నారు. ఇటువంటి అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 3, 4 తేదీల్లో జిల్లాలోని నాలుగు డిపోల వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు వెల్లడించారు. అప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే విజయనగరం జోన్‌లో 19 డిపోల్లో ఉద్యమం చేస్తామన్నారు. ఆయనతో పాటు ఈయూ నాయకులు ఎ.దిలీప్‌కుమార్, జి.త్రినాథ్, కేజీరావు తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయా.. ఇదేందయ్యా..!

- టీడీపీ ఆవిర్భావ దినోత్సవంలో టీచర్
- వెల్లువెత్తిన విమర్శలు


జెండా ఆవిష్కరణలో పాల్గొన్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు మూల ఉపేంద్ర(సర్కిల్‌లో ఉన్న వ్యక్తి)

వజ్రపుకొత్తూరు: మండలంలోని పూండిగల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించిన టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో అదే గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు మూల ఉపేంద్ర సందడి చేశారు. అమలపాడు ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఇతను చురుకుగా కార్యక్రమంలో పాల్గొన్నాడు. దీంతో ఇతని వీడియోలు, ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. టీడీపీ నాయకుడు దువ్వాడ జయరాం చౌదరి, ఇతర కార్యకర్తలు నిర్వహించిన ఈ కార్యక్రమంలో అంతా తానై ముందుకు నడిపించి, జై తెలుగుదేశం అంటూ నినాదాలు చేయడం వీడియోలో స్పష్టంగా కనిపిస్తోంది. దీంతో ఓ ప్రభుత్వ ఉద్యోగి అయ్యుండి ఇలా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడంపై మేధావులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా విద్యాశాఖ అధికారులు మాత్రం ఎటువంటి చర్యలూ తీసుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ శాఖల అధికారులతో సమావేశమై రెవెన్యూ, గ్రామ సచివాలయాలు, నీటి యాజమాన్య సంస్థ, గృహ నిర్మాణం, పారిశుద్ధ్యం, అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు తదితర అంశాలపై సమీక్షించారు. పల్లె పండుగ పనులను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు ఉపాధి హామీ పథకంలో పని దినాలను పెంచాలన్నారు. గృహ నిర్మాణాలు వేగవంతమయ్యేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సూచించారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర లక్ష్యాల సాధనకు కృషి చేయాలని ఆదేశించారు. వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. పీజీఆర్ఎస్ ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ సదస్సులు, ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ, ల్యాండ్ బ్యాంక్ నిర్వహణ, కోర్టు కేసుల పరిష్కారం, వక్ఫ్ ఆస్తుల సర్వే తదితర అంశాలపై సమగ్రంగా ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో ప్రత్యేక ఉప కలెక్టర్ పద్మావతి, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, జెడ్పీ సీఈఓ శ్రీధర్ రాజా, సీపీవో ప్రసన్నలక్ష్మి, డీపీఓ భారతి సౌజన్య, వ్యవసాయాధికారి కోరాడ త్రినాథస్వామి, ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ, డ్వామా పీడీ సుధాకర్, హౌసింగ్ పీడీ నగేష్ పాల్గొన్నారు.